# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ప్రతి ఏడాది మూడు వ్యవసాయ పంటల సాగుకు నీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**
2. **గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
3. **విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులతో మేలు చేకూరుతుందని పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ తెలిపారు.**
4. **విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేసినట్లు డీఆర్ఎం నరేంద్ర పాటిల్ వెల్లడించారు.**
5. **భీష్మ ఏకాదశి సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

==========================

రాష్ట్రంలో ప్రతి ఏడాది మూడు వ్యవసాయ పంటలు సాగు చేసేలా నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోవ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించేలా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధకం, ఆక్వా అంశాలపై కార్యశాలలను నిర్వహిస్తామని చెప్పారు.వ్యవసాయ అనుబంధ రంగాల్లో రానున్న ఐదేళ్లలో 30 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా పటిష్టమైన చర్యలను చేపట్టనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..33 సెకన్లు

-------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ – ఎయిమ్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్ నిన్న మంత్రితో సమావేశమైయ్యారు.

ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంగళగిరి ఎయిమ్స్‌లో త్రాగునీటి సమస్యను పరిష్కరించిందని, అదేవిధంగా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాను కూడా కల్పించిందన్నారు. అలాగే 965 పడకల ఆసుపత్రిగా మంజూరైన ఎయిమ్స్ లో ప్రస్తుతం 650 పడకలున్నాయని, వీటి విస్తరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులతో మేలు చేకూరుతుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో విశాఖవాసులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. కేటాయించిన నిధులను సద్వినియోగం చేసి కర్మాగారాన్ని లాభాల బాట పట్టిస్తామని తెలిపారు. జూలైలో స్టీల్ ప్లాంట్‌లో 3వ ఫర్నేస్ ప్రారంభిస్తున్నామని ఆయన తెలియజేస్తూ

వాయిస్... 32 సెకన్లు

---------------------------

ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఆధిక్యతను ప్రదర్శిస్తోందని మాజీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గత ఎన్నికల తీర్పుకు భిన్నంగా డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి అనుగుణంగా ఢిల్లీ ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. బీజేపీకి ఇది చారిత్రాత్మక విజయమని తెలిపారు.కాగా ఈ రోజు ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలలో 70 స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతోంది. ఇందులో భారతీయ జనతా పార్టీ 48 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ 22 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది.

---------------------------

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలు వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ఆరోగ్యశ్రీకి.. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు.

---------------------------

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేసినట్లు రైల్వే డివిజనల్ మేనేజర్ - డీఆర్ఎం నరేంద్ర పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పనులలో భాగంగా 1,287.76 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆధునీకరించే పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 58 శాతం నవీకరణ పూర్తయి అందుబాటులోకి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. నిడదవోలు-భీమవరం, నరసాపూర్-గుడివాడ-మచిలీపట్నం, కాకినాడ పోర్టు - సామర్లకోట మార్గంలో 473.4 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను ఆధునీకరించామని ఆయన వెల్లడించారు.

---------------------------

భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ రోజు రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇందులో

భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులో కొలువైన భూదేవి శ్రీదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

------------------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకం క్రింద రాయితీతో ఇంటిపైకప్పుపై సౌర ఫలకాలను నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సురేంద్రనాయుడు తెలిపారు. తిరుపతిలో సూర్య ఘర్ యోజన పథకంపై ఈ రోజు నిర్వహించిన అవగాహనా మేళాలో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు రోజుల పాటు అవగాహనా మేళాను నిర్వహిస్తామన్నారు.

------------------------------

రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాల విభాగం ఆదేశాలు జారీ చేసింది. మెరుగైన మార్కులు, వందశాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక తరగతులు, అభ్యసనం, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ద లాంటి చర్యలు తీసుకోవాలని సూచించింది. సగటు, అంతకంటే పైస్థాయిలో ఉన్న విద్యార్థుల మార్కులు మెరుగుపర్చేందుకు అదనపు పాఠ్యపుస్తకాలను అందించాలని తెలిపింది. విద్యార్థులందరికీ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించింది.

------------------------------

తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీకాళహస్తీ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను ఎమ్మెల్యే ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 21వతేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించానున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25వతేదీన ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తారని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..20 సెకన్లు

------------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 34 సెకన్లు....

------------------------------

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 20వ తేదీన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం తెలిపింది. మంత్రివర్గ ఆమోదం కోసం ప్రతిపాదిత అంశాలను 18వ తేదీ సాయంత్రం లోపు పంపాలని అన్ని శాఖల అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

======================